విద్యార్థులకు ఇబ్బందులు రానీయొద్దు

- అవసరమైన సదుపాయాలు కల్పించాలి
- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఉప్పరపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్, జూన్ 27: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు ఉండాలని, తాగునీటి వసతి కల్పించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. గురువారం ఆమె మక్తల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ఏయే పనులు చేపట్టారు? ఇంకా ఏం పనులు చేయాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 560మంది విద్యార్థులు ఉన్నారని తెలుసుకున్న కలెక్టర్ వారి సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. పలు తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏం తిన్నారని అడిగారు. అందరికీ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు వచ్చాయా అని అడుగగా, కొందరికి యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందలేదని విద్యార్థులు తెలిపారు. వెంటనే అందజేయాలని అధికారులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. 10 జీపీఏ ఎంతమంది సాధిస్తారని విద్యార్థులను అడిగి, మీకు అవసరమైన వసతి సౌకర్యాలను, విద్యా ప్రమాణాలను పెంచేందుకు తాము కృషి చేస్తామని చెప్పారు. డిసెంబర్ వరకు సిలబస్ పూర్తవుతుందని, బాగా చదివి పరీక్షలు రాసి 10 జీపీఏ సాధించాలని చెప్పారు. అనంతరం సంగంబండ రోడ్డుమార్గంలోని కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించారు. సమస్యలపై అక్కడి ఎస్‌వోను అడిగి తెలుసుకున్నారు. 6, 8, 9వ తరగతితోపాటు ఇంటర్ సెకండియర్ విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పారు. పాఠశాల ప్రహరీని పరిశీలించారు. ఆవరణలో వివిధ రకాల పూల, పండ్ల మొక్కలు పెంచాలని, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో కస్తూర్బా పాఠశాలను మోడల్‌గా మార్చాలని ఎస్‌వోను ఆదేశించారు. అంతకుముందు ఉప్పర్‌పల్లి ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. కొత్త నిర్మాణాల గురించి ఆరా తీశారు. పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు నేటికీ పంపిణీ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే అందజేయాలని ఆదేశించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ పాఠ్య పుస్తకాలు అందజేశారు.

లక్ష్యాలు చేరుకోవాలి

నారాయణపేట టౌన్, జూన్ 27: బ్యాంకర్లు ప్రజలకు అందించే రుణాలలో నిర్దేశించబడిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో 2024-25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పీఎం ఈజీపీ కింద యూనిట్లు స్థాపించడానికి అర్హులైన వారికి రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, ఆర్‌బీఐ ప్రతినిధి గోమతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి బాలిక చదువుకునేలా చూడాలి

జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టి, ప్రతి బాలిక చదువుకునేలా చూడాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో భేటీ పడావో.. భేటీ బచావో, బచ్‌పన్ బచావో ఆందోళన్, చైల్డ్ మ్యారేజ్‌ఫ్రీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో బాలిక మండలిని ఏర్పాటు చేసి బాల్య వివాహాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గత కలెక్టర్ శ్రీహర్ష బాల్య వివాహాల నిర్మూలన కోసం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగించాలన్నారు.

కేజీబీవీ సమస్యలు పరిష్కరిస్తా

- అదనంగా విద్యార్థులను చేర్చుకోవాలి
- ధన్వాడ, మరికల్ కేజీబీవీలను పరిశీలించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

ధన్వాడ, జూన్ 27: కస్తుర్బాగాంధీ గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరిస్తానని, ఈ ఏడాది విద్యార్థులను అదనంగా చేర్చుకోవాలని నారాయణ పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సూచించారు. గురువారం ధన్వాడ మండల కేంద్రంలోని మరికల్, ధన్వాడ కేజీబీవీ పాఠశాలలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ప్రతి విద్యార్థికి నోట్‌బుక్‌లు, పాఠ్య పుస్తకాలు, అందించాలని సూచించారు. తరగతి గదులు తిరిగి విద్యార్థులతో మాట్లాడారు. ధన్వాడ కేజీబీవీ, మోడల్ స్కూల్‌లకు మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. డీగ్రీ కళాశాల, కేజీబీవీల దగ్గర సీసీ కెమెరాల మరమ్మతులు చేయించాలని సూచించారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం మంజూరు చేయిస్తానని తెలిపారు. అంతకుముందు గ్రామస్తులు డిగ్రీ కళాశాలకు సొంత భవనానికి నిధులు మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు. కళాశాలలో ప్రిన్సిపాల్ నియామకం విషయమై సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాసీల్దార్ సింధూజ, ఎంపీడీవో సాయి ప్రకాశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు నిరంజన్ రెడ్డి, నరహరి, రాంచంద్రయ్య, కేజీబీవీ మరికల్, ధన్వాడ ఎస్‌వోలు రాజ్యలక్ష్మి, గంగమ్మ పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

స్వామిజీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కుమారస్వామి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 27: బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో ది పాలమూర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో కుమారస్వామి, ఛత్రధర్ గుప్తా, వెంకటేశ్వర్లు, ప్రమోద్, నాగయ్య, నాగజ్యోతి పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం..

విద్యుదాఘాతంతో మృతి చెందిన గొర్రెలు, బర్రెల యజమానులు జమిస్తాపూర్ సత్తయ్య, ఓబులాయపల్లి నర్సింహులు, కిష్ణయ్యకు విద్యుత్ శాఖ ద్వారా వచ్చిన నష్టపరిహారం రూ.61వేల చెక్కును మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గురువారం తన క్యాంప్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఈ, ఏఈ మద్దిలేటి, వెంకటేశ్ పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను విస్తరిస్తాం..

భూత్పూర్, జూన్ 27 : సహకార బ్యాంక్ సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చి మరింత విస్తరిస్తామని బ్యాంక్ చైర్మన్ కుమారస్వామి అన్నారు. గురువారం పట్టణంలోని వాసవీ గార్డెన్స్‌లో పాలమూరు సహకార(అర్బన్)బ్యాంక్ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కంబగిరి లక్ష్మీ నర్సింహ్మస్వామి ఉపాసకుడు సద్గురు రామ్మోహన్‌స్వామి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే పాలక మండలి వైస్ చైర్మన్‌గా సూర్యనారాయణ, డైరెక్టర్లుగా శ్రీనివాసులు, రామ్మోహన్, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, తమ్మయ్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి

- ప్రజాపాలన దరఖాస్తులను అలసత్వం చేయొద్దు
- అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

చిన్నచింతకుంట తాసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట), జూన్ 27 : ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. గురువారం చిన్నచింతకుంట మండలంలో రెవెన్యూ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తాసీల్దార్ కార్యాలయంలో ధరణిలో పెండింగ్‌లో ఎన్ని దరఖాస్తులు ఉన్నాయని ఆరా తీశారు. రెండు దరకాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో గృహజ్యోతి ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, రోగులతో మాట్లాడారు. వైద్యసేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యాబోదన, అలాగే భోజన వసతి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులను తనిఖీ చేసి ధరల పట్టిక, స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధమవ్వాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 27: జూలై మొదటి వారం వజ్రోత్సవ వన మహోత్సవం ద్వారా ప్రభుత్వం నిర్ణయం మేరకు మొక్కలు నాటే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేసీఆర్ ఎకో పార్క్‌లో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వజ్రోత్సవ వన మహోత్సవం కార్యక్రమంలో 30లక్షల 87వేల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో జీపీ నర్సరీలు 441, అటవీశాఖ నర్సరీలు 9, మున్సిపాలిటీల్లోని 6 నర్సరీల్లో మొక్కలు ఉన్నాయని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన లక్ష్యం ప్రకారం జూలై మొదటివారంలో నిర్వహించే వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఆర్‌డీవో నర్సింహులు, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్ పాల్గొన్నారు.

మెగావర్క్‌షాప్‌నకు ఆహ్వానం

పాలమూరు, జూన్ 27: ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఈనెల 30న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే తెలుగు కార్టూనిస్ట్స్ మెగా వర్క్‌షాప్‌లో పాల్గొనాలని తనకు ఆహ్వానం అందిందని మహబూబ్‌నగర్ క్యారికేచర్ చిత్రకారుడు జమాల్పూర్ మహేశ్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రముఖ కార్టూనిస్టులు పాల్గొననున్నారన్నారు.

బస్సును సద్వినియోగం చేసుకోండి

నారాయణపేటరూరల్, జూన్27: నారాయణపేట డిపో నుంచి ప్రారంభమైన విజయవాడ డీలక్స్ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట డీఎం లక్ష్మీసుధ గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3:20గంటలకు పేట నుంచి విజయవాడకు బయలుదేరుతుంది, ఊట్కూర్, మఖ్తల్, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, దేవరకొండ, నాగార్జునసాగర్, మాచర్ల, గుంటూర్ ద్వారా విజయవాడకు ఉదయం 3:15 గంటలకు చేరుకొంటుందని తెలిపారు. తిరిగి విజయవాడ నుంచి ఉదయం 10:15 గంటలకు బయలుదేరి అదే రూట్‌లో నారాయణపేటకు రాత్రి 8:30 గంటలకు చేరుకొంటుందని, ఈ సర్వీస్‌కు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు.

తీగల చెరువు పరిశీలన

భూత్పూర్, జూన్ 27 : చింతోలీ నుంచి మన్నూరు వరకు మంజూరైన జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ పరిధిలోని అమిస్తాపూర్-భూత్పూర్ మధ్య రోడ్డ పక్కనే ఉన్న తీగల చెరువు కట్టను మార్చేందుకు నేషనల్ హైవే అథారిటీ, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన అధికారులు గురువారం పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్, ఇరిగేషన్ డీఈ సిద్ధిక్‌అహ్మద్ కట్టను పరిశీలించి, కొలతలు చూశారు. చెరువును తొలగించేందుకు ఇరిగేషన్ అధికారులు ఒప్పుకోవడం లేదని డీఈ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సురేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

కోస్గి, జూన్ 27: నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్ ఆదేశాల మేరకు షీటీమ్ పోలీస్‌లు, భరోసా టీమ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం కోస్గిలోని గుండుమాల్ జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులకు బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా హరాస్మెంట్, పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్, గృహ హింస వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు

మిడ్జిల్/నవాబ్‌పేట, జూన్ 27: మిడ్జిల్ మండల ఎస్సైగా జయప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ డీఎస్‌బీ నుంచి మిడ్జిల్ ఎస్సైగా బదిలీపై వచ్చారు. అలాగే నవాబ్‌పేట ఎస్సైగా విక్రమ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన అభిషేక్‌రెడ్డి బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లగా, నాగర్‌కర్నూల్‌లో పనిచేస్తున్న విక్రమ్ బదిలీపై నవాబ్‌పేటకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారు మాట్లాడారు. మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

జేసీ అమృతారావు జయంతి

లెప్రసీ కాలనీలో పండ్లు పంపిణీ చేస్తున్న తల్లిదండ్రులు విద్యాకర్

మహబూబ్‌నగర్, జూన్ 27: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జేసీ అమృతారావు జన్మదిన వేడుకలను ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా జరుపుకొన్నారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా సమాధివద్ద నివాళులర్పించి, పట్టణంలోని లెప్రసీ కాలనీలో నివాసం ఉంటున్న బాధితులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. గత కొన్నేండ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అకస్మాత్తుగా కారు ప్రమాదంలో మృతిచెందడంతో, అప్పటి నుంచి ఆయన జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం, సేవా కార్యక్రమాలు చేస్తున్నామని కుటుంబ సభ్యుడు జేసీ విద్యాకర్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఊట్కూర్, జూన్ 27: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన శిబిరం నిర్వహించారు.

వైస్ ఛాన్స్‌లర్‌ను సస్పెండ్ చేయాలి

తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వీసీ దిష్టిబొమ్మ దహనం

పాలమూరు, జూన్27: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ బీజే రావును వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వీసీ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో విద్యార్థులకు సమస్య వస్తే నిరసన తెలుపడం నేరమా.. యూనివర్సిటీ నుంచి వెలి వేస్తారా అని ప్రశ్నించారు. అణచివేతలపై విద్యార్థుల పోరాటానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ మద్దతు తెలియజేస్తున్నదన్నారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. హెచ్‌సీయూలో వీసీ గెస్ట్ హౌస్ ఎదుట స్టూడెంట్స్ యూనియన్ హక్కుల కోసం నిరసన తెలియజేసినందుకు విద్యార్థుల చేత ఎన్నుకోబడిన స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌ను, మాజీ విద్యార్థి సంఘం నాయకులను, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిపి మొత్తం 5మందిని యూనివర్సిటీ యాజమాన్యం సస్పెండ్ చేసిందన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా దీనిని తీవ్రంగా ఖండించి జరగబోయే ఉద్యమానికి మద్దతు తెలుపాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు నందు, సాయి, మణికంఠ, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- జెడ్పీ సీఈవో రాఘవేందర్‌రావు

జీరో బిల్లుల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో రాఘవేందర్‌రావు

నవాబ్‌పేట, జూన్27: ప్రభుత్వం అమలు చేయనున్న ఉచిత కరెంటు కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారుల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా, వేగంగా చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈవో రాఘవేందర్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్వీకరిస్తున్న విద్యుత్ జీరో బిల్లుల దరఖాస్తులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగానే దరఖాస్తుదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. హరితహారం కార్యాలయానికి మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో భద్రునాయక్, ఏపీవో జ్యోతి ఉన్నారు.

కిరాణా దుకాణాల్లో అధికారుల తనిఖీలు



కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న లీగల్ మెట్రాలజీ శాఖ అధికారి రామకృష్ణ

మహబూబ్‌నగర్, జూన్ 27: జిల్లాలోని పలు కిరాణా దుకాణాలను లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని పలు కిరాణా షాపులపై ఫిర్యాదుల నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు అధికారి పి.రామకృష్ణ తెలిపారు. లక్ష్మీ కిరాణం జనరల్ స్టోర్స్, హెచ్ మార్ట్, ఎస్.ఆర్.కే మార్ట్‌లలో ప్యాకేజీలపై మ్యానుఫ్యాక్చరింగ్ అడ్రస్, ఎమ్మార్పీ, డేట్ ఆఫ్ మ్యానుఫ్యాక్చరింగ్, కస్టమర్ కేర్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ, అడ్రస్ ఇతర వివరాలు లేకపోవడంతో వారిపై కేసు నమోదు చేశామని, రూ.40వేలు జరిమానా విధించామని తెలిపారు. వ్యాపారస్తులు తమ దుకాణాలలో డిక్లరేషన్ లేని ప్యాకేజీలు విక్రయించవద్దన్నారు. నిబంధనలు పట్టించుకోని పక్షంలో కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా ప్యాకింగ్ చేసేవారు విధిగా ప్యాకింగ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుందని, వేయింగ్ మిషన్స్ వాడేవారు. వెరిఫికేషన్ సర్టిఫికెట్స్ తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తూకంలో తేడా లేకుండా వ్యాపారం చేయాలన్నారు. వినియోగదారులు కోరినట్లయితే వారికి తమ వేయింగ్ మిషన్ కరెక్ట్‌గా ఉందా లేదా అనే విషయాన్ని చూపాలని చెప్పారు. వినియోగదారులు ఎటువంటి ఫిర్యాదు ఉన్నా లీగల్ మెట్రోలజీ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, లేదా వాట్సాప్ ద్వారా 90106 51783 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

జడ్చర్ల, జూన్ 27 : జడ్చర్ల పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో గురువారం జడ్చర్ల మండల వ్యవసాయశాఖ అధికారి గోపినాథ్ తనిఖీలు చేశారు. పట్టణంలోని న్యూసప్తగిరి, వాసవి, ధనలక్ష్మి, నరేందర్ ఎరువులు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్, పాస్ మిషన్లలోనే ఎరువులను అమ్ముతున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. అదేవిధంగా రిజిస్టర్‌లో ఉన్న స్టాక్‌కు, దుకాణంలో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

ఊట్కూర్, జూన్ 27: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి గురువారం ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, బసయ్య, మంజునాథ్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

2నుంచి ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు

పాలమూరు, జూన్27: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జూలై 2వ తేదీ నుంచి ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డా.ఉత్తరపల్లి రామాచార్యులు గురువారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని శ్రీవారి సేవకులు భజన మండలి వారి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమాలు జూలై 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలోని వివిధ దేవాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీవారి సేవకులు పాండురంగం, సురేశ్, చందర్దూత్, చంద్రకళారెడ్డి, నిర్మలమ్మ, ప్రభావతమ్మ, హజలాపురం భజన మండలి సభ్యులు నారాయణగౌడ్, చంద్రశేఖర్, నరసింహులు, మాతృమండల సభ్యులు లక్ష్మీసింధు, సాధన పాల్గొన్నారు.

డయల్ 100 కాల్స్‌కు తక్షణం స్పందించాలి

- నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్

వీసీలో పాల్గొన్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట, జూన్ 27: డయల్ 100 కాల్స్ పట్ల తక్షణమే స్పందించాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో బ్లూ కోట్స్ సిబ్బందికి ఒకరోజు శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వర్తిస్తున్న వర్టికల్ విభాగాల్లో బ్లూ కోట్స్ సిబ్బంది ముందు వరుసలో ఉండి ఆపద సమయంలో తక్షణ స్పందన కలిగి ఉండాలన్నారు. ప్రతి పోలీసు సాంకేతికంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు పాత నేరస్తులను తనిఖీ చేస్తూ వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బ్లూ కోట్స్ విధులు నిర్వర్తించేవారు అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం..

జూలై నుంచి అమల్లోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్షా అదినియా 2023 చట్టాలపై జిల్లాలోని పోలీసు అధికారులకు, సిబ్బందికి శిక్షణ అందజేయడం జరిగిందని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. గురువారం డీజీపీ రవిగుప్త హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీసీలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. నూతన చట్టాలపై జిల్లా పోలీసులకు అవగాహన వచ్చే వరకు నిరంతరం వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాలలో డీఎస్పీ లింగయ్య, ఎస్‌బీ సీఐ రాంలాల్, డీసీఆర్‌బీ ఎస్సై సునీత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 27: చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ సహ సంచాలకుడు డి.బాలు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చేందుకు చేనేత, డిజైనిం